## 300 వ అధ్యాయం

## ٣٠٠ـ بَابُ النَّهْيِ عَنْ تَرْكِ النَّارِ فِي الْبَيْتِ عِنْدَ النَّوْمِ وَنَحْوِهِ سَوَاءٌ كَانَتْ فِي سِرَاجٍ أَوْ غَيْرِهِ

## నిద్రపోయే సమయంలో , ఇలాంటివే ఇతర సందర్భాల్లో ఇంట్లో ఉండే నిప్పుని - అది దీపమయినా లేక మరేదయినా- ఆర్పకుండా వదిలేయరాదు

١٦٥٤ ـ عَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللهُ عَنْهُمَا عَنِ النَّبِيِّ ﷺ قَالَ: «لَا تَتْرُكُوا النَّارَ فِي بُيُوتِكُمْ حِينَ تَنَامُونَ» متفقٌ عليه.

1654. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రబోధించారు: మీరు నిద్రపోయేటప్పుడు మీ ఇండ్లలో మండుతున్న నిప్పుని ఆర్పకుండా వదిలేయకండి.

(బుఖారీ-ముస్లిం)

(సహీహ్ బుఖారీలోని ఇస్తీజాన్ ప్రకరణం - సహీహ్ ముస్లింలోని అష్రిబా ప్రకరణం)

١٦٥٥ ـ وَعَنْ أَبِي مُوسَى الأَشْعَرِيِّ رَضِيَ اللهُ عَنْهُ قَالَ: احْتَرَقَ بَيْتٌ بِالْمَدِينَةِ عَلَى أَهْلِهِ مِنَ اللَّيْلِ، فَلَمَّا حُدِّثَ رَسُولُ اللهِ ﷺ بِشَأْنِهِمْ قَالَ: «إِنَّ هٰذِهِ النَّارَ عَدُوٌّ لَكُمْ، فَإِذَا نِمْتُمْ فَأَطْفِئُوهَا» مُتَّفَقٌ عَلَيْهِ.

1655. హజ్రత్ అబూ మూసా అష్అరీ (రజి) కథనం : ఒకసారి మదీనాలో ఒక ఇల్లు, ఆ ఇంటి సభ్యుల సమేతంగా కాలిపోయింది. జనం దాని గురించి దైవప్రవక్త (సల్లం)కు చెప్పారు. అది విని ఆయన "ఈ అగ్ని మీ శత్రువు. కనుక మీరు నిద్రపోయేటప్పుడు దాన్ని ఆర్పి నిద్రపోండి" అని చెప్పారు.

(బుఖారీ-ముస్లిం)

(సహీహ్ బుఖారీలోని ఇస్తీజాన్ ప్రకరణం - సహీహ్ ముస్లింలోని అష్రిబా ప్రకరణం)

١٦٥٦ ـ وَعَنْ جَابِرٍ رَضِيَ اللهُ عَنْهُ عَنْ رَسُولِ اللهِ ﷺ قَالَ: «غَطُّوا الإِنَاءَ، وَأَوْكِئُوا السِّقَاءَ، وَأَغْلِقُوا البَابَ، وَأَطْفِئُوا السِّرَاجَ، فَإِنَّ الشَّيْطَانَ لَا يَحُلُّ سِقَاءً، وَلَا يَفْتَحُ بَاباً، وَلَا يَكْشِفُ إِنَاءً. فَإِنْ لَمْ يَجِدْ أَحَدُكُمْ إِلَّا أَنْ يَعْرُضَ عَلَى إِنَائِهِ عُوداً، وَيَذْكُرَ اسْمَ اللهِ، فَلْيَفْعَلْ، فَإِنَّ الفُوَيْسِقَةَ تُضْرِمُ عَلَى أَهْلِ البَيْتِ بَيْتَهُمْ» رواهُ مسلم.
«الفُوَيْسِقَةُ»: الفَأْرَةُ، وَ «تُضْرِمُ»: تُحْرِقُ.

1656. హజ్రత్ జాబిర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రబోధించారు: పాత్రల్ని మూసి ఉంచండి. కూజల మూతలు బిగించండి. తలుపులు మూసి ఉంచండి. దీపాలు ఆర్పేయండి. ఎందుకంటే షైతాను బిగించబడి ఉన్న కూజల్ని, మూయబడివున్న తలుపుల్ని, పాత్రల్ని తెరువలేడు. మీలో ఎవరికయినా మూయటానికి ఏమీ లభించకపోతే దానికి అడ్డంగా దేవుని పేరు తీసుకొని ఒక చెక్కముక్క అయినా ఉంచండి. ఎందుకంటే (కొన్ని సందర్భాల్లో) చిట్టెలుక కూడా ఇంటిని, ఇంటి వారి సమేతంగా కాల్చేయగలదు. (ముస్లిం)

*(సహీహ్ ముస్లింలోని అష్రిబా ప్రకరణం)*

## ముఖ్యాంశాలు

రాత్రిపూట పడుకోబోయే ముందు దీపాలు, స్టవ్‌లు, హీటర్లు మొదలగు నిప్పుని రాజేసే వస్తువులన్నిటినీ ఆర్పి మరీ నిద్రపోవాలి. ఇటువంటి వస్తువులను గనక ఆర్పివేయకుండా నిద్రపోయినట్లయితే ప్రమాదాలు జరగటానికి చాలా ఎక్కువ అవకాశాలు ఉన్నాయి. అలాగే కుండలు, కూజాలు, గిన్నెలు మొదలగు పాత్రల్లో క్రిమి కీటకాలు దూరకుండా, మరేదయినా హానికర వస్తువు పడిపోకుండా వాటిపై ఎల్లప్పుడూ మూతలు వేసి ఉంచాలి. వస్తువులను ఎక్కడైనా పెట్టేటప్పుడు గాని, వాటిని ఉపయోగించేటప్పుడు గాని అల్లాహ్ పేరు స్మరించి మరీ పని చేయటం అన్ని విధాలా శ్రేయస్కరం.